

మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

బహుజనవాదం రాజకీయ ఉద్యమం కావాలి

రాంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బహుజనవాదం బలమైన రాజకీయ ఉద్యమం కావాలని, అప్పుడే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా ఏర్పడిన బంధు సొసైటీ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. రాజ్యాధికారంతోనే బహుజనులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి జరుగుతుందన్నారు. బహుజనులైన మహనీయుల విగ్రహాలు గ్రామాల్లో ఎన్ని పెట్టినా అధికారం దక్కదని, బహుజనుల ఓట్లు బహుజనులు వేసుకుంటేనే రాజ్యాధికారం దక్కుతుందని చెప్పారు. ఆధిపత్య పార్టీలకు ఓట్లు వేసినంత కాలం బహుజనుల బతుకుల్లో మార్పు ఉండదని తెలిపారు. కుల సంఘాల నాయకులు ఎన్నికల చివరి రోజుల్లో ఆధిపత్య పార్టీలకు అమ్ముడుపోతున్నారని ఆరోపించారు. దశాబ్దాలుగా పాలితులుగానే ఉంటున్న బహుజనులు ఆలోచించి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన అట్టికట్ల భరత్‌భూషణ్, ప్రొఫెసర్ ముత్తయ్య, ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తమ్, ప్రొఫెసర్ నతానియెల్, ప్రొఫెసర్ జి.కనకయ్య, జూపాక సుభద్ర, పి.వీరస్వామిలు మాట్లాడుతూ బహుజనులంతా సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బంధు సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలి: ఆర్.కృష్ణయ్య

రాంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జనగణనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేయాలని, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5,6 తేదీల్లో పార్లమెంటు వద్ద నిరసన, ధర్నా కార్యాక్రమాలు చేపడుతున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య తెలిపారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ డిమాండ్లపై బీసీ సంఘాల సదస్సు జరిగింది, ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు రాజ్యాంగ పరంగా రావాల్సిన హక్కులను కల్పించడంలో మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బీసీ బిల్లు పెట్టి బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ కులగణన కోసం ఢిల్లీలో పార్లమెంట్ వద్ద రెండు రోజులపాటు జరిగే నిరసనలు, ధర్నాలకు దేశవ్యాప్తంగా పదివేల మందికి పైగా బీసీలు హాజరవుతున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో 50 శాతం పదవులు బీసీలకు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని ఆయన డిమాండ్ చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా విజయ్‌సూర్య

మహబూబ్‌నగర్ జిల్లా బీసీ యువజన సంఘం అధ్యక్షుడి డి విజయసూర్య నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య శనివారం బీసీ భవన్‌లో ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నాయకులు భూపేష్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దయార మార్కెట్ నుంచి రాజా డీలక్స్ థియేటర్ వరకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం రవిచారి మాట్లాడుతూ ఈ రోడ్డు మార్గంలో నిత్యం వేలాది వాహనాలరాకపోకలు సాగుతున్నాయని, దాంతో ప్రస్తుతం రోడ్డు అంతా గుంతలమయంగా మారిందని అన్నారు. వెంటనే నిధులు కేటాయించి నూతన రోడ్డు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరినట్టు తెలిపారు. బాకారం ధర్మాచరణసమితికి సంబంధించిన శ్మశానవాటికలో అభివృద్ధి పనులుచేయాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

నిలిచిపోయిన డ్రైనేజీ పనులను పూర్తి చేయాలి

- కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డ ప్రధాన రహదారిలో నిలిచిపోయిన డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి జలమండలి అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి రోడ్డును తవ్వి వదిలివేశారని, దీంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. శనివారం ప్రాంతాన్ని సందర్శించిన కార్పొరేటర్ ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జలమండలి డీజీఎం సన్యాసీ రావుకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. వెంటనే పనులను పూర్తి చేస్తామని జలమండలి అధికారులు హామీ ఇచ్చారని ఆమె ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు మల్లికార్జున్, వెంకటేష్, భీమ్‌రాజ్, రవియాదవ్, రమాదేవి, ఆర్.సంతోష్ పాల్గొన్నారు.

'పద్మశాలీలు రాజకీయ రంగంలో రాణించాలి'

చిక్కడపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు రాజకీయ రంగంలో రాణించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని శ్రీలలితా పరమేశ్వరి దేవాలయంలో గాంధీనగర్ పద్మశాలి సంఘం నూతన క్యాలెండర్‌ను కార్పొరేటర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్, సంఘం అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్, వెంకటేష్, పాపయ్య, భిక్షపతి, వినోద్, అనిల్‌కుమార్, రామ్‌ప్రభాకర్, నిరంజన్ పాల్గొన్నారు.

అతివేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరం

- ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట్ ఏసీపీ శంకర్‌రాజు

కవాడిగూడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమని, ఒక్కోసారి ఆ వేగమే వారి ప్రాణం తీయవచ్చని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల నేపథ్యంలో దోమలగూడలోని ఏవీ కళాశాలలో రహదారుల భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అతివేగంతో వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, వేగం ఆనందం కలిగిస్తుంది. కానీ, అది జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ఎన్‌వైకేఎస్ జిల్లా యువజన అధికారి ఖుష్బుగుప్తా, చిక్కడపల్లి, దోమలగూడ పీఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యుదయ రచయితల సంఘం గ్రేటర్ కార్యవర్గం ఎన్నిక

బర్కత్‌పుర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) గ్రేటర్ హైదరాబాద్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా చంద్రమోహన్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి.రామ్మోహన్‌రెడ్డి, వి.వి.చారి, కుమార్, బాలఠాకూర్, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ ఎస్.విజయభాస్కర్, బి.వెంకటేశ్వర్లు, జి.శివకుమార్, డి.కె.నాయక్, కోశాధికారిగా రాజు ఎన్నికయ్యారు. నూతన కమిటీని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ అభినందించారు.

కమ్యూనిటీ హాల్‌లో బతుకమ్మ చీరలు

- ఎన్నికల కోడ్‌తో అప్పట్లో ఆగిన పంపిణీ
- నాలుగు నెలలైనా ఇంకా అక్కడే...
- ఉపయోగంలో గ్రౌండ్ ఫ్లోర్ ఒక్కటే..
- శుభకార్యాలకు ఉపయోగపడని మరో అంతస్తు
- ఆవరణలో అక్రమంగా వాహనాల పార్కింగ్
- అపరిశుభ్రంగా టాయిలెట్లు
- పట్టించుకోని అధికారులు



ఆవరణలో పార్క్ చేసిన వాహనాలు



బతుకమ్మ చీరలు ఉంచి తాళం వేసిన గది

చిక్కడపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు చేసుకోవడానికి నిర్మించిన కమ్యూనిటీహాల్, బతుకమ్మ చీరల గోదాంగా మారింది. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ జీ ప్లస్ వన్ కమ్యూనిటీహాల్‌లో జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వానంగా మారింది. అక్టోబర్‌లో ఎన్నికల కోడ్ రావడంతో బతుమ్మ చీరల పంపిణీ నిలిపివేశారు. ముషీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన చీరలు కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తులో పెట్టి తాళం వేశారు. నాలుగు నెలలైనా వాటిని తొలగించలేదని స్థానికులు అంటున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే శుభకార్యాలు చేసుకోవడానికి అనుమతిస్తుండడంతో సరిపోవడం లేదని, చార్జీ మాత్రం రెండు ఫ్లోర్లకు కలిపి తీసుకుంటున్నారని వాపోయారు. ఎస్సార్టీ టీఆర్‌టీ కాలనీ సొసైటీ సభ్యులు జీహెచ్ఎంసీ సర్కిల్-15 డీఎంసీ తిప్పర్తి యాదయ్యకు వినతిపత్రం ఇచ్చి నెలరోజులయినా సమస్య పరిష్కారం కాలేదు. కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో చెత్త వేయడంతో డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తోంది. చెత్తను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రాంగణంలో ఖాళీ ప్రాంతంలో కొంతమంది వాహనాలను పార్కింగ్ చేయించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయంటున్నారు. అధ్వానంగా ఉన్న టాయిలెట్లను శుభ్రం చేయించాలని, కమ్యూనిటీహాల్‌ను ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కిడ్నీ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



యశోద ఆస్పత్రిలో సదస్సును ప్రారంభించిన గవర్నర్ తమిళిసై

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ జబ్బులపై ప్రజలకే కాదు.. ప్రాక్టిషనర్స్‌కు సమగ్ర అవగాహన ఉండాలని, కిడ్నీ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో అత్యాధునిక క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సును ఆమె శనివారం ప్రారంభించారు. గవర్నర్ మాట్లాడుతూ అక్యూట్ కిడ్నీ ఇంజూరీస్, క్రానిక్ రీనల్ కిడ్నీ ఫెయిలర్ గురించి ఇంకా చాలా మందికి తెలియదన్నారు. వీటిపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. యశోద ఆస్పత్రుల డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ ప్రజల్లో మూత్రపిండాల వ్యాధులు, మూత్రపిండాల ఆరోగ్యం పైన అవగాహన పెంపొందించడానికి శిక్షణ ఇచ్చేందుకు అంతర్జాతీయ వైద్య నిపుణులు ముందుకురావటం హర్షణీయమని అన్నారు. కిడ్నీవైద్య రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ అంతర్జాతీయ వైద్య నిపుణులతో వారి అనుభవాలను పంచుకునే విధంగా ముడు రోజుల అంతర్జాతీయ సదస్సును రుపొందించినట్లు నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ కృషి



మదర్స్ హైస్కూల్ వీధిలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న గౌరీశంకర్, సలాంద్రి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

రాంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మదర్స్ హైస్కూల్ వీధిలో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను బీజేపీ నేతలు శనివారం పరిశీలించారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి చొరవతో దీర్ఘకాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారమైందని వారన్నారు.

అడిక్‌మెట్ డివిజన్‌లోని మదర్స్ హైస్కూల్ వీధిలో డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గతంలో స్థానికులు, మురుగు సమస్యను పరిష్కరించాలని కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వగా, ఆయన ఈ విషయాన్ని జలమండలి అధికారులకు వివరించారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌరీశంకర్, ఓబీసీ మోర్చా సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు సలాంద్రి శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. స్పందించిన జలమండలి అధికారులు జనరల్ బడ్జెట్‌తో నూతనంగా డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేశారని వారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ కృషి చేస్తోందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అండగా ఉండాలని కాలనీవాసులను కోరారు. సమస్యను పరిష్కరించిన జలమండలి అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరేష్, పార్టీ నాయకులు కిషోర్, శాస్త్రి, కౌండిన్య ప్రసాద్, సంఘం బాల్‌రాజ్, ఎస్.లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మధు, నర్సింగ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



గౌతమ్‌రావును సత్కరిస్తున్న అనూహ్యారెడ్డి

బర్కత్‌పుర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధిస్తుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌తోపాటు తెలంగాణాలోని పది ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో కోవిద ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అనూహ్యరెడ్డి ఆధ్వర్యంలో పలువురు కళాకారులు సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు నియమితులైన డాక్టర్ ఎన్.గౌతమ్‌రావును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, గతంలో కాంగ్రెస్ పాలన అవినీతి, కుంభకోణాల్లో కూరుకుపోయిందని ధ్వజమెత్తారు. బీజేపీని గెలిపించడానికి ప్రతి ఒక్కరు సైనికులువలే పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఏ.సూర్యప్రకాష్‌సింగ్, చిట్టి శ్రీధర్, సుప్రియాగౌడ్, శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతల్లేని సమాజం కోసం కులగణన చేపట్టాలి



నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దుండ్ర కుమారస్వామి

బర్కత్‌పుర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, బీసీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి పేర్కొన్నారు. అసమానతల్లేని సమాజాన్ని నిర్మించాలంటే బీసీ కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నగరానికి వచ్చిన నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేసి బీసీల సమస్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపడితే సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో పూర్తి విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. అప్పుడే సంక్షేమ పథకాలను అమలు చేయవచ్చని అన్నారు. ఓబీసీ జాబితాలో కొన్ని బీసీ కులాలు లేకపోవడం వల్ల పేద విద్యార్థులు జాతీయ స్థాయిలో విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు కోల్పోతున్నారని అన్నారు. బీసీల స్థితిగతులపై లోతైన అధ్యయనం చేయాలని, బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ చేస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 50 శాతానికి పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ యువజన విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాయి యాదవ్, నగర అధ్యక్షుడు రాజేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్

- మణికొండలో పిట్టలవాని పాలెం ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

నార్సింగ్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం మణికొండలో గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972-74 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ - సకుటుంబ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 50 ఏళ్ల క్రితం ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు స్వర్ణోత్సవాలు చేసుకోవడం చాలా సంతోషకరమన్నారు. నేడు మన కుటుంబాల్లో తెలుగు తక్కువగా మాట్లాడుతున్నారని, మన భాషను మనమే కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అప్పట్లో చదువుచెప్పిన ఉపాధ్యాయులు సాంబశివరావు, విష్ణుప్రసాద్, వెంకటనారాయణ, కృష్ణంరాజు, సుబ్బయ్యను పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల మనవలు, మనవరాళ్ళు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

- జాతీయజెండా అవనతం చేస్తుండగా ప్రమాదం



రాజాభిక్ష (ఫైల్)

పేట్‌బషీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా ఇనుపరాడ్‌ను బయటకు తీస్తుండగా.. ఆ రాడ్‌కి ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాజాభిక్ష(36) కుటుంబ సభ్యులతో కలిసి మేడ్చల్ జిల్లా దేవరయాంజల్ గ్రామంలోని తిరుమల వెంచర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఉన్న పాలీకెమ్ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా శుక్రవారం తిరుమల వెంచర్‌లో కాలనీవాసులతో కలసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సాయంత్రం జెండాను అవనతం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు కొంపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం భార్య బిస్మిల్లా ఇచ్చిన ఫిర్యాదుమేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వ్యాపారి మృతి

బర్కత్‌పుర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భోజనం చేయడానికి హోటల్‌కు వచ్చిన వ్యాపారి గుండెపోటుతో మృతి చెందాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ మేఘన తెలిపిన వివరాల ప్రకారం. రాంకోఠిలో నివాసం ఉంటున్న రాసికలాల్ కిలోసియా (65) వ్యాపారి. శనివారం మధ్యాహ్నం 1.30 సమయంలో బర్కత్‌పుర లింగంపల్లి చౌరస్తా వద్ద హోటల్‌కు భోజనం చేయడానికి వచ్చాడు. అక్కడ భోజనం చేసిన తర్వాత తన వాహనం వద్దకు వస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. హోటల్ నిర్వాహకులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. అంబులెన్స్‌ను రప్పించి సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. కిలోసియా గుండె జబ్బుతో బాధపడుతున్నట్లు అతని కుమారుడు తపన్ రాసికలాల్ కిలోసియా తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమావేశం

3,4 తేదీల్లో మహారాష్ట్ర, జాల్నాలో ..

చిక్కడపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 3,4 తేదీలలో మహారాష్ట్ర, జాల్నాలో రెండు రోజుల పాటు దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమావేశం నిర్వహిస్తున్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, నూతనంగా అమలులోకి వస్తున్న విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, హక్కుల పరిరక్షణలో భవిష్యత్తుకు రోడ్డుమ్యాప్, సిటిజన్ చార్టర్ విడుదల తదితర అంశాలపై చర్చించనున్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని కార్యాలయంలో సంఘం జాతీయ కమిటి ఉపాధ్యక్షురాలు దొంతి శిల్పారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంతోపాటు దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల ప్రతినిధులు హాజరుకావాలని అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ ఫీడర్ పరిధిలో వివిధ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీఈ ప్రేమానంద్ పాయ్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దేవునితోట, ఎస్సీఎస్టీ హాస్టల్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, కవాడిగూడ, బోలక్‌పూర్ హౌస్, రిలయన్స్ టవర్స్ ప్రాంతాలు... మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముషీరాబాద్ పరిధిలోని మెయిన్‌రోడ్, బీర్బన్‌గల్లీ, కేర్ ఆస్పత్రి, పర్వాన్ హోటల్, రాజా డీలక్స్, బడీ మసీదు, సత్తార్ బాగ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏడీఈ తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నేడు

ముషీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం కార్యకర్తల విస్తృతస్థాయి ఆదివారం ఉదయం 10 గంటలకు ముషీరాబాద్ కషిష్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరవుతున్నట్టు బీఆర్ఎస్ నియోజకవర్గ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, భోలక్‌పూర్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించింది



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

బర్కత్‌పుర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను అర్హులకు అందించి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. ఎమ్మెల్సీగా నియమితులైన ఆయన శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించి అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల జీవితాలలో వెలుగులు నింపడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. సీఎంను కలిసిన వారిలో ఎన్ఎస్‌యూఐ గ్రేటర్ అధ్యక్షుడు ఎడ్ల అభిజిత్‌యాదవ్ ఉన్నారు.



పురస్కారాలు ప్రదానం చేసిన అతిథులు

ప్రతిభా పురస్కారాలు ప్రదానం

చిక్కడపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో ప్రతిభా పురస్కారాల బహూకరణ సభ జరిగింది. జై జవాన్‌జై కిసాన్ పేరిట శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో పలువురు చిన్నారులు శాస్త్రీయ నృత్యాలు చేయగా, గాయనీ గాయకులు దేశభక్తి గీతాలు ఆలపించారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ ప్రతిభావంతులకు పురస్కారాలు ప్రదానం చేశారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దర్శకేంద్రుడు కే.రాఘవేంద్రరావు

కొటేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జీవితానుభవాలను కవిత్వంగా మలిచి, ఆ కవిత్వాన్ని మంచి మాటలుగా మార్చి, అందరికీ అర్థమయ్యే సరళమైన భాషలో కొటేషన్లుగా మార్చి క్యాలెండర్ రూపొందించడం స్ఫూర్తిదాయకమని ప్రముఖ దర్శకుడు కే.రాఘవేంద్రరావు అన్నారు. కొటేషన్‌లను చదువుకోవడానికి వీలుగా కవి కొత్త శ్రీనివాస్ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "జీవితమనే మహాభారతంలో కృష్ణుడు నీవే, అర్జునుడు నీవే, జీవన పోరాటంలో యోధుడివి నువ్వే సారథి నువ్వే, గెలిచి నిలవడానికి వ్యూహం నీదే, ఆయుధం నీదే" అనే కొటేషన్ ఎంతో ప్రేరణాత్మకంగా ఉందని అన్నారు. శ్రీనివాస్ కొటేషన్‌లు ఎంతో ప్రేరణను ఇస్తాయని, వీటితో జీవితాన్ని ఆదర్శవంతంగా రూపొందించుకోవచ్చన్నారు. సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించడం ఈ క్యాలెండర్ ముఖ్య ఉద్దేశమని రచయిత కొత్త శ్రీనివాస్ తెలిపారు.

బల్దియా.. ఇదేందయ్యా..!

(3వ పేజీ తరువాయి)

రూ.388 నుంచి రూ.435 వరకు(సర్కిళ్లను బట్టి) చెల్లిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. 2022లో మరో ఏజెన్సీతో చేసుకున్న అగ్రిమెంట్ ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. రవాణా చార్జీల చెల్లింపు ఒకే విధంగా ఉన్నా.. ప్రాసెసింగ్ రుసుము మాత్రం యేడాది మాత్రమే చెల్లిస్తామని ఒప్పందంలో పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో భాగంగా తయారు చేసే ఇటుకలు, పేవర్ బ్లాక్‌లు, ఇతరత్రా ఉత్పత్తులు విక్రయించి ఆదాయం పొందాలని సూచించారు. ఒకే రకమైన పనికి ఒక్కో ఏజెన్సీతో ఒక్కోలా అగ్రిమెంట్లు కుదుర్చుకోవడంపై గతంలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే గత కమిషనర్ సదరు సంస్థకు చెల్లింపులు నిలిపేయాలని, మరో ఏజెన్సీ తరహాలోనే ఒప్పందంలో మార్పులు చేసే విషయాన్ని పరిశీలించాలని సూచించారు. దీంతో కొన్నాళ్లపాటు బిల్లులకు సంబంధించిన ఫైళ్లను అధికారులు పక్కన పెట్టారు.

కమిషనర్ బదిలీపై వెళ్లిన అనంతరం తిరిగి చెల్లింపులు మొదలయ్యాయి. రెండు ఒప్పందాలను పరిశీలిస్తే ఓ సంస్థకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే ఉద్దేశం స్పష్టంగా తెలుస్తోందని పౌర సంస్థ ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సదరు సంస్థకు రూ.60కోట్లు చెల్లించినట్టు అధికార వర్గాలు చెబుతున్నా యి. మరో రూ.10-15 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ఆ సంస్థకు బిల్లులివ్వొద్దని గత కమిషనర్ చెప్పిన అనంతరమూ చెల్లింపులు జరగడం గమనార్హం. ఇంకో విషయం ఏమిటంటే.. 95 శాతం వ్యర్థాలకు అన్‌క్లెయిమ్డ్(ఎవరివో తెలియని) కేటగిరీలో బిల్లులు చెల్లిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.